క్లుప్తంగా

పైపులైన్‌కు మరమ్మతులు



వాజేడు: మండల పరిధిలోని చింతూరు, లక్ష్మీపురం గ్రామాల మధ్యన కాలిపోయిన పైపులైన్‌కు గురువారం మరమ్మతులు చేశారు. చింతూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. రెండు గ్రామాల మధ్యన ఉన్న కట్టకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. గడ్డి, పొదలు కాలుతూ వచ్చి మిషన్ భగీరథ పైపులైన్‌కు నిప్పు అంటుకుని కాలిపోయింది. దీంతో చింతూరు గ్రామానికి తాగు నీటి సరఫరా ఆగి పోయింది. విషయం తెలుసున్న మిషన్ భగీరథ గ్రిడ్ సిబ్బంది, గ్రామ పంచాయతీ సిబ్బంది కాలిపోయిన పైపులైన్‌కు మరమ్మతులు చేసి తాగునీటిని అందించారు.

ముగ్గురిపై కేసు నమోదు



ఏటూరునాగారం: మండల కేంద్రంలోని స్కైవిజన్ డిజిటల్ ఆఫీస్‌లో ఈనెల 9న కొంత మంది చోరీకి పాల్పడి సెటాప్ బాక్సులను ఎత్తుకెళ్లినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. స్కైవిజన్ యజమాన్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టగా రేణుక ఎల్లమ్మ ఆలయం వద్ద ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా దొంగతనానికి పాల్పడిన వ్యక్తుల చిత్రాలు, వీడియో రికార్డు అయిందన్నారు. ఇందులో రామన్నగూడెం గ్రామానికి చెందిన అక్కిపెల్లి రాఘవ, గార నిశాంత్(పండు) ఆఫీస్ వద్దకు చేరుకొని పైఅంతస్తులో ఉన్న బాక్సులు ఎత్తుకెళ్లారన్నారు. పక్కా సమాచారం మేరకు రాఘవ ఇంటి వద్ద బాక్సులను రికవరీ చేశామన్నారు.

వ్యక్తికి జైలు

కన్నాయిగూడెం: ఈ నెల 11న హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని గురువారం పోలీసులు జైలుకు పంపించారు. మండల కేంద్రానికి చెందిన రాజును కత్తితో పొడిచి పరారీలో ఉన్న మహేశ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు.

కార్యదర్శికి సన్మానం



గోవిందరావుపేట: మండలంలోని చల్వాయి గ్రామానికి బదిలీపై వచ్చిన గ్రామ కార్యదర్శి గంప రమేశ్‌కు గురువారం కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వేల్పుగొండ ప్రకాశ్ ఆధ్వర్యంలో మాజీ ఎంపీటీసీ గుండెబోయిన నాగలక్ష్మీ అనిల్ యాదవ్ శాలువాతో సత్కరించారు. సుధాకర్, చాపల ఉమాదేవి, పడిదల సాంబయ్య, మేకల సుదర్శన్, కంకణాల నర్సయ్య, చుంచు రమణ, ముద్దసాని సాయి, సతీష్ రెడ్డి, గుంటి సంపత్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం బొమ్మాపూర్ మలుపు వద్ద మహదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ, డ్రంకన్ డ్రైవ్ నిర్వహించారు. గురువారం సాయంత్రం కాటారం–మహదేవపూర్ ప్రధాన రహదారిపైన వాహనాలు నిలిపి ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. సరైన పత్రాలు లేని వారికి జరిమానా వేశారు. ఆయన వెంట సివిల్, టీఎస్ఎస్‌పీ పోలీసులు ఉన్నారు.

ఉదయం ఎండ.. సాయంత్రం వాన



కల్లాల్లో ఆరబోసిన ధాన్యం



మబ్బులతో ధాన్యంపై కప్పిన పరదాలు

- కల్లాల్లో ధాన్యం రాశులు
- ఆందోళనలో అన్నదాతలు

వెంకటాపురం(కె): రైతన్నలకు వరుణుడు వనుకు పుట్టిస్తున్నాడు. రోజు రోజుకూ వాతావరణ పరిస్థితులు మారుతుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వారం రోజులుగా పగలు మొత్తం ఎండలు కొడుతూ సాయంత్రం గాలితో కూడిన వర్షాలు కురుస్తుండటంతో అన్నదాత ఏం చేయాలో తెలియక భయాందోళన చెందుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికి అందవచ్చే సమయంలో అకాల వర్షాలు కురుస్తుండడంతో పంట చేతికి అందే పరిస్థితి లేక పెట్టుబడులు వస్తాయో రావో అని రైతులు ఆందోళన చెందుతున్నారు.

50 శాతం కోతలు పూర్తి

మండలంలో ఇప్పటికే 50 శాతానికి పైగా వరికోతలు కోశారు. కోసిన పంటను కొంత మంది రైతులు కల్లాలో ఆరబెట్టగా మరికొందరు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించారు. కాగా మారుతున్న వాతావరణ పరిస్థితుల కారణంగా రైతులు తమ పంటను మిల్లర్లకు, దళారులకు తక్కువ రేటుకు విక్రయించుకుంటున్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఇప్పటి వరకు కొనుగోలు ప్రారంభం కాకపోవటంతో చేసేది ఏమి లేక దళారులకు విక్రయించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు.

మబ్బులతో ఆందోళనగా ఉంది



వారం రోజుగా వాతావరణం మారి మబ్బులు రావటంతో ఆందోళన చెందాల్సి వస్తుంది. దినికి తోడు సాయంత్రం గాలి దుమారంతో కూడిన వర్షాలు పడుతున్నాయి. పంటలను కాపాడుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కోత కోసిన పంట కల్లాల్లోనే ఉంది.

– కొప్పుల కృష్ణ రైతు

ఉచిత కంటి వైద్యపరీక్షలు



ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని బుట్టాయిగూడెం, గుర్రేవుల అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు కంటి వైద్య పరీక్షను ఆర్‌బీఎస్‌కే వైద్య బృందం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు శారీరక, మానసిక, కంటి చూపు పరీక్షలను నిర్వహించారు. వైద్యాధికారులు తిరుపతి, ఆర్‌బీఎస్‌కే జిల్లా నోడల్ అధికారి నరహరి తదితరలు ఉన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో..

మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలో గురువారం అస్తమాజీ విభాగం ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా 23 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ములుగు ఏరియా వైద్యశాలకు రిఫర్ చేశారు. వారికి ఈ నెల 21న కంటి ఆపరేషన్ నిర్వహించనున్నట్లు వైద్యాధికారులు తెలపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి అభినవ్ తదితరులు ఉన్నారు.

స్థలం కేటాయించాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రవి

మల్హర్: సీఎస్ఆర్ నిధుల ద్వారా మండలంలోని తాడిచర్ల గ్రామంలో నిర్మించబోయే వాటర్ ప్లాంట్ నిర్మాణానికి స్థలాన్ని కేటాయించాలని కోరతూ.. తాడిచర్ల, కాపురం గ్రామాల జెన్‌కో భూ నిర్వాసితుల హక్కుల సాధన పోరాట కమిటీ అధ్యక్షుడు కేసారపు రవి తహసీల్దార్ రవికుమార్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం రవి మాట్లాడుతూ.. స్థలం కేటాయింపునకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించనట్లు తెలిపారు. ఈ మేరకు ఆర్ఐకి ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లం పాకాన్ని పారబోస్తున్న పోలీసులు

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఇమ్మడిగూడెం తండాలో గుడుంబా స్థావరాలపై ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. తండాలోని ప్రతి ఇంటిలో తనిఖీలు నిర్వహించి గుడుంబా తయారీ కోసం ప్లాస్టిక్ డ్రామ్ముల్లో నిల్వ చేసి బెల్లం పాకాన్ని పారబోశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. 20 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకుని 100 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీ చేసిన విక్రయించిన వారిపై చట్టరీత్య చర్యలు తీసుకోవడంతోపాటు కేసులు నమోదు చేస్తామన్నారు.

చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

- ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు



మాట్లాడుతున్న నాయకులు

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు తాటి నాగరాజు అన్నారు. గురువారం మండ కేంద్రంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో ఆదివాసీలకు ప్రత్యేక హక్కులు చట్టాలు స్వయం పాలన హక్కులు ఉన్నప్పటికీ అమలు కావటం లేదని అన్నారు. గిరిజన చట్టాలకు విరుద్ధంగా బహుళ అంతస్తులు నిర్వహిస్తున్న అధికారులు పట్టించుకోవటం లేదని అన్నారు. ఈ నెల 20న కాఫెడ్ స్వచ్ఛంధ సంస్థ ఆవరణంలో నిర్వహించే సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యకరమంలో నాయకులు ఇర్పరాజు, ఉయిక గోపి, శ్యామల కృష్ణ, ఈశ్వర్, వంశీ తదితరులు ఉన్నారు.

రైతు బాంధవుడు కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి



బైక్ ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

టేకుమట్ల: రైతు బాంధవుడు మాజీ సీఎం కేసీఆర్ అని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రం నుంచి వెంకట్రావుపల్లి వరకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్ ఆధ్వర్యంలో నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి ఎకరానికి రూ.10వేల రైతుబంధు రైతులందరికీ అందించారని, అలాగే మృతి చెందినరైతు కుటుంబాలకు రూ.5లక్షల రైతు బీమాలో అందించిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. తాగు, సాగు నీటికి ఎలాంటి కష్టాలు లేకుండా రైతుల పక్షాన నిలిచారని, కానీ నేటి ప్రభుత్వం సాగు నీరందించండి అంటూ రైతులు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని వాపోయారు. ఇప్పటికీ రాష్ట్రంలో బీఆర్ఎస్ పథకాలు చిరకాలం నిలిచేలా ఉన్నాయని, మరోసారి బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ నెల27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు భారీ సంఖ్యలో ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సట్ల రవిగౌడ్, మాజీ ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, నల్లబెల్లి రవీందర్, ప్రధాన కార్యదర్శి ఆకునూరి తిరుపతి, అచ్చె లచ్చన్న, గువ్వాడి లక్ష్మన్, శ్రీనివాస్, ఆది రఘు, ఉమేందర్‌రావు ఉన్నారు.

దేశంలో ప్రజా వ్యతిరేక పాలన



ములుగు రూరల్: నినాదాలు చేస్తున్న నాయకులు



గోవిందరావుపేట: కోటగడ్డలో..

- కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అశోక్

ములుగు రూరల్: బీజేపీ ప్రభుత్వం దేశంలో ప్రజా వ్యతిరేక పాలన కొనసాగిస్తుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ పేర్కొన్నారు. మండలంలోని రాంచంద్రాపూర్‌లో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమాలు కాంగ్రెస్ కిసాన్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పైడాకుల అశోక్ హాజరై మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక పాలనను అంతం చేయాలన్నారు. బీజేపీ నాయకులు మహాత్మ గాంధీని, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని అవమాన పరిచే విధంగా మాట్లాడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోవిందరావుపేట: మండలంలోని కోటగడ్డ, సోమలగడ్డ, పాపయ్యపల్లి, రాంనగర్ గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాలడుగు వెంకటకృష్ణ ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు రేగ కల్యాణి హాజరై మాట్లాడారు. దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ చేసిన త్యాగాలను స్మరించుకుంటూ గ్రామ గ్రామాన ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. సుధాకర్, కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి, సూదిరెడ్డి జనార్దన్ రెడ్డి, రసపుత్ సీతారాం నాయక్, తేళ్ల హరిప్రసాద్, జంపాల ప్రభాకర్, ఎండీ సూజాత, భూక్య రాజు, పెండెం శ్రీకాంత్, పడిదల సాంబయ్య, జంపాల చంద్రశేకర్, మద్దాల నాగమణి, జయమ్మ, చిక్కుల వెంకటేశ్ పాల్గొన్నారు.



వెంకటాపురం(ఎం): పాలంపేటలో..

వెంకటాపూర్(ఎం): మండలంలోని పాలంపేట, రామాంజపూర్, వెళ్తుర్లపల్లి, నారాయణగిరిపల్లి గ్రామాల్లో టీపీసీసీ సభ్యుడు మల్లాడి రాంరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరెడ్డి భగవాన్ రెడ్డి ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యక్రమాలు పార్టీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిలుగా జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోత్ రవిచందర్ హాజరయ్యారు. ముందుగా పాలంపేటలోని రామప్ప ఆలయంలో శ్రీ రామలింగేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామి వారి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం జై బాపు, జై భీమ్, జై సంవిదాన్ కార్యాక్రమాన్ని ప్రారంభించి, బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను అంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్

ములుగు రూరల్: బీఆర్ఎస్ రజతోత్సవ సభ వేడుకల పోస్టర్‌ను ఆ పార్టీ మల్లంపల్లి మండల సమన్వయకర్త పాలెపు శ్రీనివాస్ మండల కేంద్రంలో మల్లంపల్లి టౌన్ ప్రెసిడెంట్ చీదర సంతోష్ ఆధ్వర్యంలో గురువారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల ప్రభాకర్, రేణిగుంట్ల సురేష్, పోర్ల ఐలయ్య, రవీందర్, చోటు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పాత్ర కీలకం

- ఎంఈఓ రేగ కేశవరావు



మాట్లాడుతున్న ఎంఈఓ రేగ కేశవరావు

ఎస్ఎస్‌తాడ్వాయి: విద్యార్థి జీవితంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రేగ కేశవరావు అన్నారు. మండలంలోని భూపతిపూర్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేసిన కొర్నెబెల్లి భూపాల్‌రావు పదవీ విరమణ సన్మాన కార్యక్రమం గురువారం కామారంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ కేశవరావు హాజరై మాట్లాడుతూ.. ప్రతీ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని ఉద్యోగ నిర్వహణలో ఆయన చేసిన సేవలు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తాయన్నారు. ఉపాధ్యాయుల వృత్తి చాలా కష్టంతో కూడుకున్నదని చెప్పారు. ఈ సందర్భంగా కొర్నెబెల్లి భూపాల్‌రావు జనాకి దంపతులను ఎంఈఓ కేశవరావు ఉపాధ్యాయులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఉపాధ్యాయకులు పాల్గొన్నారు.

21న 'భూ భారతి'పై అవగాహన సదస్సు

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఈనెల 21న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ జగదీశ్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ సదస్సు హాజరై భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు.

22న ప్రాతాపురంలో..

వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాత్రాపురం గ్రామంలోని రైతు వేదికలో ఈ నెల 22న భూ భారతి చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లక్ష్మీరాజయ్య గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సు ఉదయం 10 గటలకు కలెక్టర్ దివాకర అధ్యక్షతన నిర్వహిస్తామని రైతులు హాజరు కావాని కోరారు.

అక్రమ కేసులను ఎత్తేయాలి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



భూపాలపల్లి అర్బన్: కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

భూపాలపల్లి అర్బన్: నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలో అంబేడ్కర్ సెంటర్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. నిరసన కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాజకీయ కక్షతోనే కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తప్పుడు కేసు నమోదు చేసినట్లు ఆరోపించారు. గాజర్ల అశోక్, రవీందర్, కొమురయ్య, శ్రీనివాస్, శ్రీను, రవి పాల్గొన్నారు.

ఈడీ చార్జ్‌షీట్‌ను ఖండిస్తున్నాం..

కాళేశ్వరం: నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా గాంధీ, రాహుల్‌గాంధీలపై ఈడీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మహదేవపూర్ యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ నయీమొద్దీన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమని, బీజేపీ ప్రభుత్వం ఇలాంటి ధోరణి అవలంభించడం మంచి పద్ధతి కాదన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పలిమెల: గర్భిణికి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది



మొగుళ్లపల్లి: ఇస్సిపేటలో..



టేకుమట్ల: సుబ్బక్కపల్లిలో..

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత

మొగుళ్లపల్లి: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రజిత అన్నారు. మండలంలోని పాత ఇస్సిపేటలోని అంగన్‌వాడీ సెంటర్‌లో సెక్టార్ లెవల్ పోషణ పక్వాడ కార్యక్రమంను నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, పిల్లలు పౌష్టికాహారం తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, హెల్త్ సూపర్‌వైజర్ సునీత పాల్గొన్నారు.

టేకుమట్ల: మండలంలోని సుబ్బక్కపల్లి, రాఘవరెడ్డిపేట అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో పోషణ పక్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసాన్ని చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాసమల్ల స్వప్న, కొండ్ర నిర్మల, వంగ వనమాల, ఉపాధ్యాయులు అంగన్‌వాడీ ఆయా, ఆశా కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలు ఉన్నారు.

పలిమెల: పోషకాహారంతోనే చిన్నపిల్లలు, బాలింతలు, గర్భిణులకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అంగన్‌వాడీ టీచర్ల అన్నారు. పోషణ పక్వాడలో భాగంగా మండలంలోని తిమ్మేటిగూడెం, ముకునూర్, నీలంపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లు చిరుధాన్యాలు, పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. హెచ్‌ఎంలు బీ.శ్రీధర్, మౌనిక, హెల్త్ డిపార్ట్‌మెంట్ హెచ్‌ఎం లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు అరుంధతి,రేగ ఆదిలక్ష్మి, కుర్సం కమల, ఏఎన్‌ఎం పుష్ప, ఆశ వర్కర్ శ్రీలత, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

భూపాలపల్లి అర్బన్: మండలంలోని కొంపల్లి గ్రామంలో పోషణ పక్వాడను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆకునూరి సునీత, ప్రైమరీ స్కూల్ హెచ్‌ఎం విజయ, ఉపాధ్యాయులు రమేశ్, కోమల, గ్రామపంచాయతీ సెక్రటరీ లింగయ్య హాజరయ్యారు ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. గర్భిణులు తీసుకోవాల్సిన ఆహారం, మానసిక ఆరోగ్యం గురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు సుదేష్ణ, స్వరూప, రజిత, మమత, ఆశ కార్యకర్తలు రజిత, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

రేగొండ: మహిళలకు ఆరోగ్యకరమైన పోషకాహారం అందించడమే పోషణ పక్వాడ లక్ష్యమని భూపాపల్లి ఐసీడీఎస్ సీడీపీఓ మల్లీశ్వరి అన్నారు. పోషణ పక్వాడలో భాగంగా గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోని పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గర్భిణీలకు సీమంతం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు ఉన్నారు.

నియామకం



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహ కమిటిని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన ఐలయ్య, ప్రధానకార్యదర్శిగా నాగుల సాయికుమార్, కోశాధికారిగా గడ్డం వెంకటేశ్వర స్వామి, ఉపాధ్యక్షుడిగా తైనేని రమేశ్, సహాయకార్యదర్శిగా విజయగిరి దేవేందర్‌లతో పాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. వారి వెంట అనీల్‌కుమార్, కొరిశెట్టి పవన్, దాగం గణేష్‌కుమార్, రాము, చీలం అనీల్ ఉన్నారు.